సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం, 1, సెప్టెంబర్, 2023



కౌలుకు మేలు

కౌలు రైతులకు మేలు జరగనుంది. వారికి రైతు భరోసా నగదు ఖాతాల్లో జమ కానుంది.

- 8లో



సమాచార సేకరణ కీలకం

కేసుల దర్యాప్తులో డేటా కీలకమని ఎస్పీ తెలిపారు. ఆమె సిబ్బందితో సమీక్షించారు.

- 8లో

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో శుక్రవారం నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక అందించనున్నారు. ఈ నెలకు గాను 3,16,974 పింఛన్లకు గాను రూ.85.88 కోట్లు మంజూరు చేశారు. ఇందులో 6242 కొత్త పింఛన్లు ఉన్నాయి. ఐదు రోజుల పాటు వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేస్తారు.

న్యూస్‌రీల్

జగనన్న కాలనీ పరిశీలన



ఆటస్థలం కోసం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

జలుమూరు: లింగాలవలస జగనన్న కాలనీ త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ పనులు త్వరిత గతిన చేయాలని ఆదేశించారు. ఆయన గురువారం లింగాలవలస, చల్లవానిపేట జగనన్న కాలనీ పనులు పరిశీలించారు. ప్రధానంగా ముఖ ద్వారం, బీటీ రోడ్డు, వీధుల్లో గ్రావెల్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే కాలనీలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే జగనన్న కాలనీకి తూర్పు వైపు ఉన్న స్థలం ప్రభుత్వానిదేనా అని తహసీల్దార్ ను అడిగారు. డీ పట్టా భూమి అని చెప్పగా.. దాన్ని స్వాధీనం చేసుకుని పిల్లల కోసం ప్లే గ్రౌండ్‌గా రూపొందించాలని సూచించారు. ఆయనతోపాటు ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, హౌసింగ్ పీడీ నక్క గణపతిరావు, ఎంపీపీ వాన గోపి, ఎంపీడీఓ ఎల్వీ అప్పారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు తదితరులు ఉన్నారు.

నలుగురు ఎంపీడీఓలకు డీఎల్‌డీఓలుగా ప్రమోషన్



అరసవల్లి: జిల్లాలో సీనియర్ ఎంపీడీఓలకు డివిజనల్ స్థాయి ఉద్యోగులుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ఓఎస్డీగా పనిచేస్తున్న కె.హేమసుందరరావు, జిల్లా మెప్మా పీడీగా పనిచేస్తున్న ఎం.కిరణ్ కుమార్, అలాగే కంచిలి ఎంపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, కవిటి ఎంపీడీఓ పి.సూర్యనారాయణ రెడ్డిలకు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (డీఎల్‌డీఓ)గా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు సిద్ధం చేశారు. ఒకటి రెండు రోజుల్లో వీరికి స్థానాలను కేటాయించనున్నారు.

ముగ్గురు ఈఓపీఆర్డీలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు

అరసవల్లి: జిల్లాలో పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు కొనసాగుతున్నాయి. జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న నలుగురికి ఎంపీడీఓలుగా పదోన్నతులు ఇచ్చిన ఉన్నతాధికారులు, పంచాయతీ స్థాయిలో ముగ్గురు సీనియర్ ఈఓపీఆర్డీలకు కూడా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓ)గా పదోన్నతులు కల్పించారు. సంతబొమ్మాళి ఈఓపీఆర్‌డీ హెచ్.శశిభూషణరావు, ఎల్ఎన్ పేట ఈఓపీఆర్డీ జీయూఆర్‌పీఎస్ శ్యామలాకు మారిలకు విజయనగరం జిల్లా, అలాగే పాతపట్నం ఈఓపీఆర్డీ ఎన్.పండాను పశ్చిమ గోదావరి జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆడుదాం ఆంధ్ర' పోటీలపై సమీక్ష



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాత బస్టాండ్: ఆడుదాం ఆంధ్ర పోటీలు అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు గ్రామ సచివాలయం నుంచి స్టేట్ లెవెల్ వరకు జరుగుతాయని, విజేతలకు స్పోర్ట్స్ కిట్లు ఇస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఈ పోటీలపై జిల్లాలోని అన్ని మండల అభివృద్ధి అధికారులు, మండల ఎడ్యుకేషన్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో గురువారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మండలాల్లో క్రీడల పోటీలు నిర్వహించేందుకు కావాల్సిన సదుపాయాలు, మైదానాల స్థితిగతులపై సూచనలు అందజేశారు. మాస్టర్ డేటాను పూర్తి చేసి సెట్‌శ్రీ కార్యాలయానికి, కలెక్టరేట్‌కు రెండు రోజుల్లో పంపించాలన్నారు. స్టేట్ లెవెల్ పోటీలు విశాఖలో నవంబర్ 4 నుంచి మొదలవుతాయని తెలిపారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమాచారమంతా సేకరించి సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే 15 ఏళ్లు దాటిన వారు మాత్రమే ఈ పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్ రావు పాల్గొన్నారు.



ప్రయాణం.. ప్రమాదం

జిల్లా కేంద్రంలో విద్యార్థులు ప్రమాదకరంగా ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేస్తున్నారు. ప్రమాదకరంగా కాలేజీలు, బడులకు వెళ్లి, వచ్చే సమయాల్లో ఈ తరహా ప్రయాణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా వీరిలో మార్పు కనిపించడం లేదు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం







ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్న యువకులు

అంతా ఐనవాళ్లమే..!

- ఒకరి నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు
- అవగాహన లేక మట్టిపాలవుతున్న అవయవాలు
- సెప్టెంబర్ 8 వరకూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



ఇచ్ఛాపురం రూరల్: కొందరు తమ బతుకంతా అమ్మను వినడమే గానీ చూడలేరు. ఇంకొందరు నాన్న వేలు పట్టుకుని నడవడమే తప్ప తండ్రి రూపు రేఖలు తెలుసుకోలేరు. మరికొందరు చుట్టూ ఉన్న లోకం గురించి తెలుసుకోవడం తప్ప ఆ అందాలను ఆస్వాదించలేరు. కానీ వీరిలో చాలా మందికి చూపు వచ్చే అవకాశం ఉంది. అందుకు ఏకైకమార్గం నేత్రదానం. మనిషి చనిపోయాక నేత్రాలను దానం చేస్తే ఆ కళ్లు ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదిస్తాయి. ఇలా దానాలతో చూపులు ప్రసాదించగలిగితే అందరం అయినవాళ్లమే అవుతాం.

ఇదే అంశంపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావడానికి ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. కంటి చూపు లేనివారికి ఒకరి నుంచి సేకరించిన రెండు కళ్లలో ఒకటి అమర్చినా, అలా ఇద్దరికి చూపు వచ్చే అవకాశం ఉంటుందని, నేత్రదానానికి ప్రజలు ముందుకు రావాలని వైఎస్సార్ కంటి వెలుగు సిబ్బంది జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రచారం కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2009 నుంచి ఇప్పటి వరకు 482 మంది నుంచి కార్నియాలు సేకరించి 777 మందికి అమర్చారు.

కార్నియా అంధత్వం

కంటి ముందు భాగంలోని నల్లటి భాగాన్ని కప్పి ఉంచే పొరను కార్నియా అంటారు. ఏటా వందల మంది కార్నియా అంధులుగా మారుతున్నారు. వీరిలో 50 శాతం మంది యువతీ, యువకులు, చిన్నపిల్లలే విటమిన్-ఏ లోపం, పౌష్టికాహార లేమి, ప్రమాదాలు, గాయాలు, శస్త్ర చికిత్సలతో వచ్చే ఇన్‌ఫెక్షన్‌లతో కార్నియా అంధత్వం వస్తుంది. మనిషికి 50 ఏళ్లు దాటాక కళ్లలో శుక్లాలు వస్తాయి. శస్త్రచికిత్సల ద్వారా చూపు వస్తుంది. కార్నియా అంధత్వానికి నేత్రాల కార్నియా మార్పిడే మార్గం. కార్నియా దెబ్బ తిని చూపు కోల్పోయిన వారు రోజురోజుకూ పెరుగుతున్నా, నేత్రదానం చేసే వారు పెరగడంలేదు. నేత్రదానానికి ముందుకు వచ్చిన వారిలో కొందరు మృత్యువాత పడిన సమయానికి వారి కళ్లను దానం చేయలేకపోతున్నారు.

ఎవరు అర్హులు..?

- ప్రమాదవశాత్తు గుండెజబ్బులు తదితర దీర్ఘకాలిక జబ్బులతో మరణించిన వారు, సహజ మరణం పొందిన వారు నేత్రదానం చేయడానికి అర్హులు.
- ఏ వయస్సు వారైనా, కంటి అద్దాలు ధరించిన వారైనా, షుగర్ వ్యాధిగ్రస్తులు, అధిక రక్తపోటు ఉన్న వారైనా మరణానంతరం నేత్రదానం చేయవచ్చు.
- నేత్రదానం చేసిన తరువాత కృత్రిమ కళ్లను మృతుడికి అమర్చుతారు.
- అంతిమ సంస్కారాలకు ఇబ్బంది ఉండదు.
- 18 ఏళ్లు నిండిన వారు వయస్సుతో సంబంధం లేకుండా నేత్రదానం చేయవచ్చు.

ఎవరు దానం చేయకూడదు..

- హెచ్ఐవీ, కామెర్లు, కుష్టు వ్యాధి, రుబెల్లా, సిఫిలిస్ వంటి వ్యాధిగ్రస్తులు, కరోనా పాజిటివ్, హైపటైటిస్ ఉన్నవారు నేత్రదానానికి అనర్హులు.
- పాముకాటు వల్ల, కుక్కకాటు వల్ల మరణించిన వారు, నీటిలో మునగడం వల్ల, ఒళ్లు కాలడం వల్ల మరణించినవారు, కంటిపాపపై తెల్లని మచ్చలు, కంటిలో నీటి కాసుల వ్యాధి ఉన్నవారు నేత్రదానానికి అర్హులు కారు.

కార్నియా సేకరణ ఇలా

నేత్రదానం 15-20 నిమిషాల్లో పూర్తయ్యే ప్రక్రియ. కంటి భాగంలోని కార్నియాను మాత్రమే తీసుకుంటారు. చాలా మందిలో కన్ను మొత్తాన్ని తీసుకుంటారన్న అపోహ ఉంది. నేత్రాలను తొలగించిన వెంటనే సహజమైన కన్నుల మాదిరిగా కనిపించే కృత్రిమ కన్నును అమర్చుతారు. మరణించిన ఆరు గంటల్లోగా కార్నియాను సేకరించాలి. ముందుగా ఐ బ్యాంకు వారికి సమాచారం ఇవ్వాలి. వారు వచ్చేలోగా రెండు కనురెప్పలను మూసివేసి, దూది లేదా మెత్తని వస్త్రాన్ని వాటిపై కప్పి ఉంచాలి. మృతదేహాన్ని ఫ్రీజర్‌లో పెట్టినా, ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

అవగాహన కల్పిస్తున్నాం



నేత్రాలను దానం చేసేందుకు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేకుండా పోయింది. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లాలో వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. నేత్రదానం చేసేందుకు ఇప్పుడిప్పుడు ప్రజలు ముందుకు వస్తున్నారు. 2009 నుంచి ఇప్పటి వరకు 777 మందికి అమర్చాము. - డాక్టర్ కె.త్రినాథరావు, జిల్లా అంధత్వ నివారణ అధికారి, శ్రీకాకుళం



జిల్లా కేంద్రంలో అంధత్వ నివారణ ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ ఎం.నవీన్ (ఫైల్)

నేత్రదానం చేయాలనుకునే వారు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

ఆస్పత్రి-మండలం	కంటి వైద్యులు/ ఆఫ్తాలమిక్ అధికారులు	సెల్ నంబర్
జిల్లా ఆసుపత్రి-టెక్కలి	డాక్టర్ శ్రీరాములు	8309149407
సీహెచ్‌సీ-పాతపట్నం	డాక్టర్ శేషుబాబు	9493905251
సీహెచ్‌సీ-నరసన్నపేట	డాక్టర్ స్ఫూర్తి	9441879121
జీజీహెచ్-శ్రీకాకుళం	డాక్టర్ బి.కె.జైన్	7032949699
జలుమూరు	కె.రామేశ్వరి	9908847996
పలాస-కాశీబుగ్గ	ఆర్‌వి.రమణ	9492419865
శ్రీకాకుళం అర్బన్	ఎం.బాబూరావు	9490346745
సోంపేట	ఎం.లక్ష్మణరావు	9441320604
ఆమదాలవలస రూరల్	బీవీఎం ప్రసాదరావు	9440942236

సమస్యల ప్రస్తావన..

పరిష్కారాల సూచన



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- అర్థవంతంగా జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు
- అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ దిశానిర్దేశం
- జిల్లాకు కొత్తగా 6247 మందికి కొత్త ఫించన్లు రావడంపై హర్షం

అరసవల్లి: జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం అందుతుందని, తాజాగా కొత్తగా 6,247 మందికి పింఛన్లు ఈ సెప్టెంబర్ నుంచే అందనున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రకటించారు. అలాగే జెడ్పీ సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన ప్రతి సమస్యపైనా ఆయా శాఖాధికారులు సీరియస్‌గా తీసుకుని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. గురువారం జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాల్లో భాగంగా 1వ, 2వ, 4వ, 7వ స్థాయీ సంఘ సమావేశాలకు అధ్యక్షత వహించిన పిరియా విజయ.. జగనన్న పాలనలో జిల్లా ప్రగతిపై వివరించారు. కొత్తగా పింఛన్లు వర్తింపజేయడం నిజంగా విశేషమని, ఇందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లుగా ప్రకటించారు. అలాగే 3వ స్థాయీ సంఘ సమావేశానికి వైస్ చైర్ పర్సన్ పాలిన శ్రావణి, 5వ స్థాయీ సమావేశానికి వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి అధ్యక్షత వహించారు. ముందుగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ శాఖ బాధ్యతగా తమ విధులను నిర్వర్తిస్తే.. మంచి ఫలితాలు వస్తాయని, అలాగే స్థానికంగా ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమన్నారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ, విద్యుత్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పరిశ్రమల శాఖ, ఆర్‌అండ్‌బీ, డీఆర్‌డీఏ, ఆర్‌అండ్‌బీ, టూరిజం, జిల్లా వైద్యారోగ్య శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, ఐసీడీఎస్ తదితర శాఖల ప్రగతిపై సమీక్షించారు.

చర్చకు వచ్చిన పలు అంశాలు

- జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని జెడ్పీ చైర్ పర్సన్ ఆదేశించారు.
- గార మండలం శాలిహుండం కొండపై ఏపీ టూరిజం ఎమినిటీ సెంటర్‌కు శాలిహుండం మంచినీటి పథకం నుంచి ప్రత్యేక పైపు లైన్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా పర్యాటక శాఖాధికారి ఎస్.నారాయణరావు జెడ్పీ చైర్‌పర్సన్‌ను కోరగా, ఆమె వెంటనే స్పందిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బెహర్‌కు తగిన ఆదేశాలు జారీ చేశారు.
- టెక్కలి మండలం రావివలస, పొందూరు మండలంలో కొన్ని రహదారులు, సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం రహదారులు బాగులేవని, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని సభ్యులు కోరారు.
- కవిటి నుంచి మకరాంపురం మీదుగా సోంపేటకు, అలాగే జలంధరపురం నుంచి గోకర్ణపురం మీదుగా శాసనాం వరకు ఆర్టీసీ బస్సులను నడపాలని చైర్‌పర్సన్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.
- రణస్థలంలో ఆర్థోపెడిక్ డాక్టర్ సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని జెడ్పీటీసీ సీతారాం అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆ వైద్యుడిని తప్పించాలని కోరారు.
- పశు బీమా వర్తింపు విషయంలో రూ.12 కోట్లు విడుదలైందని వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ ప్రకటించారు. కాగా ఇంకా ఎవరి పశు సంపదకైనా అందకపోతే తమకు జాబితాను అందజేయాలని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తెలియజేశారు.
- రైతులకు సరిపడేలా ఎరువుల సరఫరా జరగడం లేదని లావేరు జెడ్పీటీసీ ఆరోపించారు.
- మత్స్యశాఖ తరపున బోట్ల కొనుగోలులో 40 శాతం సబ్సిడీ ఉందని డీడీ శ్రీనివాసరావు ప్రకటించారు. వైస్ చైర్‌పర్సన్ శ్రావణి ఈ విషయంపై ప్రశ్నించారు.
- సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలే ఇసుకాసురులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: ప్రజలకు అత్యంత పారదర్శకంగా, అందుబాటు ధరలతో ఇసుకను అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై టీడీపీ నాయకులు అక్కసు వెళ్లగక్కుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న రోజుల్లో ఇసుక దందా ఎలా జరిగిందో అందరికీ తెలిసిందేనని కృష్ణదాస్ పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు నాలుగు వేల కోట్లు ఇసుక పేరుతో దోపిడీ చేశారని ఆరోపించారు. వారి హయాంలో ఇసుక ద్వారా ఆదాయం ఎంత వచ్చిందో చెప్పలేని పరిస్థితి ఉందని, అసలైన ఇసుకాసురులు వారేనని విమర్శించారు. అక్రమ తవ్వకాలను అడ్డుకున్న వనజాక్షి అనే మహిళా తహసీల్దార్‌ను జుట్టు పట్టుకొని కొట్టిన చరిత్ర టీడీపీ వారిదేనని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా తమ ప్రభుత్వం ఇసుక టెండర్ల ప్రక్రియను నిర్వహించి ఏటా ప్రభుత్వానికి రూ. 760 కోట్లు ఆదాయాన్ని తీసుకువస్తోందని వివరించారు. ప్రత్యేకమైన టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసి ఇసుక విధానంలో ఎలాంటి లోపాలు ఉన్నా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. సెబ్ లాంటి నిఘా వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా ఒక ఐపీఎస్ అధికారిని నియమించి ఎక్కడా అక్రమాలు జరగకుండా చూస్తున్న తమ ప్రభుత్వంపై నిందారోపణలు చేయడం మానుకోవాలని కృష్ణదాస్ హితవు పలికారు.

ముగ్గురు ఈఓలపై సస్పెన్షన్ వేటు

అరసవల్లి: దేవదాయ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు కార్యనిర్వహణాధికారు(ఈఓ)లపై సస్పెన్షన్ వేటు పడింది. ఆలయాల వంశపారంపర్య అర్చకుల వివరాలను ప్రాపర్టీ రిజిస్టర్ 43 (10)లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన కారణంగా జిల్లాలో నరసన్నపేట శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ఈఓ కేశవరావు, శ్రీకాకుళం దూదివారి వెంకటేశ్వర స్వామి ఆలయ ఈఓ సర్వేశ్వరరావు, టెక్కలి గ్రూప్ టెంపుల్స్ ఈఓ నారాయణరావులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసారు. జిల్లా నుంచి పలువురు అర్చకులు వంశపారంపర్య హక్కులకై కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. ఈ మేరకు ఈ విషయాన్ని జిల్లా దేవదాయ శాఖాధికారి ఎస్.చంద్రశేఖర్ గురువారం ధ్రువీకరించారు.

ఇచ్ఛాపురం నాట్యకారులకు 'బి' గ్రేడ్ గుర్తింపు



ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన నలుగురు నాట్యకారులను దూరదర్శన్ వారు బి గ్రేడ్ నాట్యకారులుగా గుర్తించారు. పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీకి చెందిన శృతి పట్నాయక్, దట్టి కావ్య, స్వేచ్ఛానృత్యతరంగిణికి చెందిన ఎం.దివ్య, కె.కుమార్‌లు హైదరాబాద్‌లో దూరదర్శన్ ఛానెల్ వారు నిర్వహించిన బి గ్రేడ్ ఆర్టిస్టుల సెలెక్షన్లలో పాల్గొని బి గ్రేడ్ ఆర్టిస్టులుగా గుర్తింపు పొందారని రెండు అకాడమీల అధ్యక్షులు చిన్నా గురుస్వామి, కె.గోవిందరావు తెలిపారు.

వృక్షా బంధన్



రక్షా బంధన్ సందర్భంగా వృక్షాలను రక్షిద్దామని పిలుపునిస్తూ పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా ఉన్నత పాఠశాలలో చెట్టుకు రాఖీ కట్టారు. జాతీయ హరిత క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌ల ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, వాటి చుట్టు రక్షణగా ట్రీ గార్డులు పెట్టి 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ చెట్టుకి రాఖీలు కట్టారు. - పలాస



అభిషేకానికి బిందెలతో సిద్ధంగా నీళ్లు(ఇన్‌సెట్‌లో) శివుడికి అభిషేకాలు

పరమేశా గంగను విడుము

చినుకు జాడ లేక పైరు ఎండిపోతుండడంతో వానలు కురవాలని కోరుతూ చిన్న కర్రివానిపాలెంలో గురువారం కాశీవిశ్వనాథునికి జలాభిషేకం నిర్వహించారు. చిన్నకర్రివానిపాలెం, కొత్తపాలెం, బట్టివాని పాలెం తదితర గ్రామాలకు చెందిన భక్తుల ఆధ్వర్యంలో కాశీవిశ్వనాథునికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. వివిధ పవిత్ర నదుల నుంచి తీసుకువచ్చిన జలాలను సముద్ర జలాలతో కలిపి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలంతా బిందెలతో నీళ్లను తీసుకువచ్చి అభిషేకించారు. - కవిటి

క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఈ నెల 2 శనివారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రంకు సంబంధించి ఎమ్మెస్సీ రసాయన శాస్త్రంలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని అదనంగా ఏపీసెట్, నెట్‌తో పాటు పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే కంప్యూటర్ సైన్స్ పోస్టుకు సంబంధించి ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ గాని ఎంసీఏ గానీ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అదనంగా ఏపీ సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ గోవిందమ్మ పేర్కొన్నారు. అభ్యర్థులంతా అన్నిరకాల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె కోరారు. అలాగే డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఆనర్స్ రసాయనశాస్త్ర, ఎకనామిక్స్, కామర్స్ చదవాలనుకునే విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రకటించారు.

అమ్మవారికి నక్షత్ర హారతి


అమ్మవారికి నక్షత్ర హారతి ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నదీ తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైవర పీఠం దేవాలయంలో అమ్మవారికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా నక్షత్ర హారతి నిచ్చారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

వైభవంగా విఖనస నారాయణుల జయంతి


కోదండరామస్వామి ఆలయంలో పూజలు అందుకుంటున్న విఖనస నారాయణులు

ఇచ్ఛాపురం: మానవాళికి భక్తిమార్గం చూపిన విఖనస నారాయణుల జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం శ్రీకోదండరామాస్వామి దేవాలయం, శ్రీ జగన్నాథ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సృష్టి పూర్తయిన తర్వాత మానవుల్లో చైతన్యం కలిగించి దైవచింతన కలిగించేలా చేసిన మహావిష్ణువు ఆలోచనల నుంచి ఉద్భవించిన విఖనస నారాయణులు ప్రస్తుతం వాడుకలో ఉన్న పూజా విధానం గురించి లోకానికి చాటి చెప్పారు. ఆ విధానమే మహాక్షేత్రం తిరుపతిలో ఇప్పటికీ ఆచరిస్తున్నారని ఆయన అర్చకులు వివరించారు.

'కొత్తగా ఆలోచించండి'

టెక్కలి: మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులంతా మారుతున్న కాలానికి అనుగుణంగా విభిన్నమైన వాహనాలు తయారు చేసేలా సరికొత్త ఆలోచనలు చేయాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో మెకానికల్ ఫైనలియర్ విద్యార్థులకు ఎలక్ట్రికల్ వాహనాల తయారీపై గురువారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించారు. 'ఎలక్ట్రికల్ మానుఫ్యాక్చరింగ్ ఎ హేండ్స్ ఆన్ ప్రాక్టికల్ అప్రోచ్' అనే అంశంపై ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ నాగేశ్వరరావు వెల్లడించారు. సబ్ సిస్టమ్ ఆఫ్ ఈవీ, చాసిస్ అండ్ ఎక్సిలెస్, స్టీరింగ్ అండ్ సస్పెన్షన్ సిస్టమ్, పవర్ ట్రైన్ వైరింగ్ అండ్ హార్నెస్, ఈవీ మెటార్స్ అండ్ ఎనర్జిటిక్ డైమెన్సినింగ్, ఫైనల్ అసెంబ్లీ, క్యూసీ అండ్ టెస్టింగ్ అనే అంశాలపై రిటర్న్ స్మార్ట్ మానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అరుణ్ మనోహర్ గుర్రం, ప్రొడక్షన్ ఇంజినీర్ మనోహర్ తియోడర్ తదితరులు శిక్షణ అందజేస్తారని డైరెక్టర్ పేర్కొన్నారు.

● జలసిరి


ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో గల కళింగదళ్ జలాశయం నీటితో కళకళలాడుతోంది. ఇటీవల ఒడిశా కొండలపై వర్షాలు కురవడంతో ఆ నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరింది. –మందస

కౌలుకు మేలు

- నేడు కౌలు రైతులకు రైతు భరోసా నగదు విడుదల
- జిల్లాలో 2801 మందికి లబ్ధి

కంచిలి:

కౌలు రైతులకు ప్రభుత్వం మేలు చేస్తోంది. గడిచిన నాలుగేళ్ల కాలంలో కంటే ఈ ఏడాది మరింత ఎక్కువ మందికి కౌలు కార్డులు(పంట హక్కు సాగు పత్రాలు–సీసీఆర్సీ) జారీ చేసింది. అర్హులైన ప్రతి కౌలు రైతుకూ పంట రుణాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకొంది. వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల ద్వారా నిర్వహించిన ప్రత్యేక మేళాల్లో కౌలు రైతులకు సీసీఆర్సీలు జారీ చేసింది. అలాగే సాధారణ రైతుల మాదిరిగానే కౌలు రైతులకు కూడా సర్కారు సంక్షేమ పథకాలు అందిస్తోంది. వరుసగా నాల్గో ఏడాది కూడా రైతు భరోసా కింద కౌలు రైతులను ఎంపిక చేశారు. శుక్రవారం వారి ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. ఒక్కో రైతుకు మొత్తంగా మూడు విడతల్లో రూ.13,500



చొప్పున జమవుతాయి. మొదటి విడతలో రూ.7,500ల జమకానున్నాయి.

సీసీఆర్సీల ద్వారా సంక్షేమ ఫలాలు

కౌలు రైతులకు సీసీఆర్సీల ద్వారా పంట రుణాలతో పాటు అన్నిరకాల సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 2801 మందిని కౌలు రైతులుగా గుర్తించి సీసీఆర్సీలు అందించారు. ఇందులో దేవదాయశాఖ పరిధిలో భూములు సాగుచేసే వారు 186 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించి, వారికి కూడా సాగుహక్కు పత్రాలు జారీచేశారు. వీరందరికీ రూ.210.08 లక్షలు వరకు రైతు భరోసా నిధులు విడుదల కానున్నాయి. ఈ కౌలు రైతుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు అధికంగా ఉన్నారు. వీరందరికీ మొదటి విడతగా రూ.7,500లు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. మరో రెండు విడతల్లో రూ.4 వేలు, రూ.2వేలు చొప్పున వేస్తారు. అంతేకాకుండా ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణాలు సైతం అందించడానికి బ్యాంకర్లతో ప్రభుత్వం ఒప్పందం కుదిర్చింది. ఇలా సాధారణ రైతుల మాదిరిగానే అన్ని రకాల సంక్షేమ ఫలాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుంది.

నిధులు వినియోగించుకోండి



రైతు భరోసా నిధులు కౌలు రైతులు వినియోగించుకోవాలి. అదేవిధంగా బ్యాంకుల ద్వారా ద్వారా తీసుకొన్న వ్యవసాయ రుణాలతో వ్యవసాయం చేసి, తర్వాత క్రమం తప్పకుండా వాటిని తిరిగి చెల్లించాలి.
– కె. శ్రీధర్, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు, శ్రీకాకుళం

'పంచాయతీ పనుల్లో కార్యదర్శులదే కీలక పాత్ర'

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీల ప్రగతిలో గ్రామ కార్యదర్శులది కీలక పాత్ర అని పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శుల మూడో రోజు శిక్షణలో శుక్రవారం ఆయన పాల్గొని అయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ యూనిట్‌గా ఆదర్శ పాలన సాగితే దేశ ప్రగతి శరవేగంగా సాగుతుందన్నారు. ప్రస్తుతం పట్టణాలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో లేఅవుట్‌లు విస్తరిస్తున్నాయని, కచ్చితంగా నిబంధనలు పరిశీలించి అనుమతులు ఇవ్వాలని చెప్పారు. పంచాయతీల పరిధి దాటి ఉంటే అనుమతులు ఇవ్వకూడదని అన్నారు. రోడ్లు, రిజర్వ్ స్థలం వంటి నిబంధనలు తప్పనిసరని వివరించారు. నాలా చెల్లింపు పక్కాగా ఉండాలని అన్నారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలు రెండూ లేఅవుట్‌పై దృష్టి పెట్టాలని చెప్పారు. గ్రామ సచివాలయాల సేవలు ప్రజలకు నేరుగా అందాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

'పంట నమోదుపై దృష్టి సారించాలి'

ఇచ్ఛాపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు మేలు చేసేందుకు రెవెన్యూ సిబ్బందితో పాటు వ్యవసాయ సిబ్బంది పంట నమోదు కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు కె.జగన్మోహనరెడ్డి అన్నారు. ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఇరు శాఖాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పీఎం కిసాన్ సవరింపులు, పంట నమోదు, కౌలు రైతు రుణాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో మండల తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తిలు పాల్గొన్నారు.

హెచ్‌ఎం వ్యవహారంపై డీఎస్పీ ఆరా

గార: వమరవల్లి ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి విద్యార్థినిపై అనుచితంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదు అనంతరం డీఎస్పీ వై.శృతి గురువారం ఘటనపై ఆరా తీశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. గ్రామపెద్దల నుంచి సమాచారం సేకరించారు. ఆమె వెంట సీఐ ఎస్.కామేశ్వరరావు ఉన్నారు.

'జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి'

పలాస: ఉద్దానం జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జీడి మద్దతు ధర విషయంలో సెప్టెంబరు 9న విజయవాడలో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశం కరపత్రాలను ఆవిష్కరించారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద గురువారం పీడీఎం రాష్ట్ర సహాయక కార్యదర్శి వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

నాలుగేళ్ల డిగ్రీ కరిక్యులమ్ సమావేశానికి వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కోర్సు (ఐటీఈపీ) ప్రారంభించనున్నారు. ఇప్పటికే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రవేశ పరీక్ష సైతం పూర్తి చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సైతం ఈ కోర్సు ప్రారంభిస్తున్నారు. ఈ కోర్సు సిలబస్, కరిక్యులమ్ నిర్వహణకు సంబంధించి జాతీయ విద్యా ఉపాధ్యాయ మండలి కసరత్తు చేస్తోంది. కర్నాటకలోని మైసూర్‌లో ఈ నెల 2న రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు హాజరు కానున్నారు. ఈ నిపుణుల కమిటీ సిలబస్ కూర్పు, నాలుగేళ్ల డిగ్రీ కరిక్యులమ్ డిజైన్‌పై చర్చించనుంది. మరో పక్క మూడేళ్లు పూర్తిచేస్తే డిగ్రీ, నాలుగేళ్లు పూర్తి చేస్తే డిగ్రీ ప్లస్ బీఎడ్ అర్హత లభిస్తుంది. నూతన విద్యా విధానం అమలు నేపథ్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా ఈ కోర్సును ప్రారంభించారు. 2023–24 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో 42 విద్యా సంస్థల్లో ఈ డిగ్రీ ప్రారంభిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో ఈ కోర్సు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఒక్కటే కావటం గమనార్హం. వర్సిటీలో 100 సీట్లతో కోర్సు ప్రారంభిస్తున్నారు. బీఎస్సీ బీఎడ్ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), 50 సీట్లు బీఏబీఎడ్ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్)50 సీట్లతో కోర్సులు ప్రారంభించనున్నారు. ఈ కోర్సుకు సంబంధించి రెగ్యులర్ పోస్టులు నియామకానికి సైతం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.


వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

'సమాచార సేకరణ కీలకం'

శ్రీకాకుళం క్రైమ్ : రహదారి ప్రమాదాల కేసుల్లో సమాచారాన్ని నిర్ణీత సమయంలో దాఖలు చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఆమె గురువారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో నమోదైన గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, అత్యాచారం, హత్య కేసుల దర్యాప్తు, ఆస్తి సంబంధిత నేరాలలో రికవరీ, ముద్దాయిల అరెస్టులపై సర్కిల్ వారీ పోలీసు అధికారులతో సమీక్షించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే 48 గంటల్లో మొదటి నివేదిక, 50 రోజుల్లో మధ్యంతర నివేదిక, 90 రోజుల్లో ఫైనల్ నివేదికలు దర్యాప్తు చేసిన అధికారులు జిల్లా లీగల్ సర్వీస్, కోర్టు, ప్రమాదబీమా సంస్థలకు సమర్పించాలన్నారు. వర్చువల్ ద్వారా సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ప్రమాదాల కేసుల దర్యాప్తుపై ఎస్ఐలకు పలు సూచనలు చేశారు. ప్రాధాన్యతా కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన (గ్రేవ్) నేరాలలో సమగ్ర దర్యాప్తుతో కేసులు పరిష్కరించాలన్నారు. నైట్ బీట్స్ బలోపేతం చేసి అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహించాలని, ముఖ్య కూడళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, షాపింగ్ కాంప్లెక్సు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు డి.బాలచంద్రరెడ్డి, వై.శృతి, ఎస్.బాలరాజు, డి.విజయ్‌కుమార్, జిల్లావ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

ఆటో డ్రైవర్ నిజాయితీ

టెక్కలి రూరల్: తన ఆటోలో ప్రయాణికుడు మర్చిపోయిన బ్యాగ్‌ను మళ్లీ అతనికి అందించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మెళియాపుట్టి మండలం వసుధర గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ హెచ్‌సీ రవిశంకరరావు గురువారం టెక్కలి మండలం బొప్పాయిపురం గ్రామానికి ఆటోలో వచ్చాడు. అయితే 8 తులాల బంగారం ఉన్న బ్యాగ్‌ను ఆటోలోనే మర్చిపోయి దిగిపోయాడు. ఇంటికి వెళ్లాక బ్యాగు సంగతి గుర్తుకువచ్చి ఆటో కోసం వెతికినా దొరకలేదు. చివరకు టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో ఆటో డ్రైవర్ జోగి కృష్ణ కూడా బ్యాగు ఇవ్వడానికి యజమాని కోసం కోసం గాలించి ఎక్కడా కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి చెప్పారు. దీంతో పోలీసులు ఆటో డ్రైవర్ నిజాయితీని పోలీసులు అభినందించారు. ఎస్ఐ రామకృష్ణ సమక్షంలో బాధితులకు బంగారం అందజేశారు. అనంతరం ఆటో డ్రైవర్ నిజాయితీని గుర్తించి నగదు బహుమతి అందించారు.


పోలీసుల సమక్షంలో బంగారం అందిస్తున్న ఆటో డ్రైవర్

వైద్య విధాన్ పరిషత్‌లో 21 ఉద్యోగాలకు నోటిఫికేషన్

అరసవల్లి: ఏపీ వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో మొత్తం 21 ఖాళీలను కాంట్రాక్ట్ /ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు ఆసక్తి గల అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ భాస్కరరావు ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాప్తికి ఈ నోటిఫికేషన్ విడుదల చేశామని, 8 రకాల పోస్టుల భర్తీ కోసం ఈనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఔట్ సోర్సింగ్ విధానంలో థియేటర్ అసిస్టెంట్–7, ల్యాబ్ అటెండెంట్ –4, ఆఫీస్ సబార్డినేట్ – 2 పోస్టులను, అలాగే కాంట్రాక్ట్ విధానంలో ల్యాబ్ టెక్నీషియన్ –4 ,ఆడియో మెట్రీషియన్ –1, ఫిజియోథెరపిస్టు– 1, ఎలక్ట్రీషియన్ – 1, రేడియోగ్రాఫర్ –1 పోస్టులను భర్తీ చేయనున్నట్లుగా ప్రకటించారు. మరిన్ని వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

క్రైమ్ కార్నర్

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


బైక్ అదుపు తప్పి మృతి చెందిన వెంకటరమణ

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి మండలం బెవరపేట జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయి శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పెద్ద లింగాలవలస గ్రామానికి చెందిన భోగి చినవెంకటరమణ(34) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని సోదరుడు లక్ష్మనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ వైజాగ్‌లోని పరవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ గాజువాకలో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఇటీవల చీపురుపల్లి మండలంలోని ముల్లుపేట గ్రామంలోని బంధువుల ఇంట్లో వివాహానికి హాజరయ్యాడు. వివాహం అనంతరం బుధవారం రాత్రి 12గంటల తరువాత స్వగ్రామం పెద్ద లింగాలవలసకు బైక్‌పై వస్తుండగా బెవరపేట జంక్షన్ వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న బంటాలో పడిపోయి మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంట్లవరంలో కల్తీ మద్యం

టెక్కలి రూరల్, కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం అంట్లవరం గ్రామంలో కోరాడ విశ్వనాథం ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కోటబొమ్మాళి ఎస్ఈబీ సీఐ నాగవేణి తెలిపారు. అంట్లవరం గ్రామంలో కల్తీ మద్యం నిల్వలు ఉన్నాయని వచ్చిన సమాచారం మేరకు.. బుధవారం రాత్రి తన సిబ్బందితో వెళ్లి విశ్వనాథం ఇంటిలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అతని ఇంటిలో 117 కల్తీ మద్యం సీసాలతో పాటు 8 లీటర్ల కల్తీ మద్యం నిల్వ లభించింది. దీన్ని ఎక్కడ నుంచి తీసుకొని వచ్చారని ఆరా తీయగా ఒడిశా రాష్ట్రం నుంచి ముడి సరుకు తీసుకువచ్చి ఇక్కడ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో విశ్వనాథం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్..లారీ ఢీ


ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

కోటబొమ్మాళి: నిమ్మాడ జంక్షన్ సమీపంలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్ నుంచి పలాస వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులను దించడానికి నిమ్మాడ జంక్షన్‌లో ఆగింది. అదే సమయంలో వెనుక నుంచి లారీ వచ్చి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక సీటులో కూర్చున్న నరసన్నపేటకు చెందిన తంగుడు సంగీత, సోంపేటకు చెందిన రేగి లక్ష్మణరావు గాయపడ్డారు. అలాగే డ్యూటీలో చేరేందుకు టెక్కలి వెళ్తున్న ఆర్టీసీ డ్రైవర్ వజ్జ గోపాలరావు బస్సు నుంచి కింద పడి గాయపడ్డారు. వీరిలో సంగీత తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎన్‌హెచ్ పెట్రోలింగ్ వాహనంలో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు.

పండగ పూట విషాదం

ఎచ్చెర్ల క్యాంపస్: రాఖీ పండగ పూట ఆ ఇంటిలో విషాదం చోటుచేసుకుంది. చిలకపాలెం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేత సంతోషకుమార్ (38) అనే వ్యక్తి మృతి చెందారు. రణస్థలం మండలం గొర్లపేట గ్రామానికి చెందిన సంతోష్ కుమార్, తన భార్య శ్రావణిని తీసుకుని ఆమె సోదరుడికి రాఖీ కట్టించేందుకు బైక్‌పై పొందూరు మండలం తాడేం గ్రామానికి వెళ్లారు. రాఖీ కట్టాక ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. పొందూరు రోడ్డు నుంచి చిలకపాలేం దగ్గర 16వ నంబర్ సర్వీస్ రోడ్డుపై వెళ్తుండగా కంటైనర్ లారీని వీరి బండి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో సంతోష్‌కుమార్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయమైంది. భార్య శ్రావణి మాత్రం త్రుటిలో తప్పించుకుంది. అయితే సంతోష్‌కుమార్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచేశాడు. రాఖీ పౌర్ణమి రోజు ఈ కుటుంబంతో విషాదం అలముకుంది. భర్త కళ్ల ముందే ప్రాణాలు కోల్పోవడంతో శ్రావణి గుండెలవిసేలా రోదించారు. వీరికి మూడేళ్ల రేవంత్ కుమార్, ఏడాది పాప గ్రీష్మ ఉన్నారు. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద సంఘటన దృశ్యం


సంతోష్‌కుమార్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

మెళియాపుట్టి: మండలంలోని జలకలింగుపురం గ్రామం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కొత్తూరు మండల కన్వీనర్, విశ్రాంత ఎంఈఓ కామక త్రినాథరావు మృతి చెందారు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు కొత్తూరు మండలం కుంటిభద్ర గ్రామానికి చెందిన త్రినాథరావు మెళియాపుట్టి నుంచి టెక్కలి వైపుగా గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మర్రిపాడు–సి పంచాయతీ పరిధిలోని జలకలింగుపురం గ్రామం వద్ద ఓ మహిళ అడ్డంగా రావడంతో.. అదుపు తప్పి ఆమెను ఢీకొని, వెనక్కి పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఆయనను 108 ద్వారా టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స అందించే లోపే ఆయన మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య కామక భాగ్యవతి ప్రస్తుతం కొత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


కామక త్రినాథరావు (ఫైల్)

మృతికి సంతాపం

త్రినాథ రావు మృతిపై పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,380–00
బంగారం(22కి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220